# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

APRIL - 2002

# సంక్షిప్త వార్తలు

2002 ఫిబ్రవరి 26,27,28 తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా విప్పర్రు లో సువార్త కూటములు జరిగెను. ఆ కూటములలో సోదరులు ఆర్.సి.హెచ్. సద్గుణరావ్ (శ్రీకాకుళం), యం. సామ్యూల్‌రాజు (సింగంపల్లి), జాషువా గూటం (కాకినాడ) తదితర్లు వాక్యపరిచర్య చేసిరి. ఇద్దరు క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిరి. విప్పర్రులో సోదరులు టి.సి.హెచ్. ఫ్లెమింగ్స్ గారు సువార్త పని చేయుచున్నారు.

ఫిబ్రవరి 23వ తేదీ మంగళవారం కృష్ణాజిల్లా కేసరిపల్లిలో జరిగిన సువార్త కూటములో సోదరులు కె. రాజకుమార్ (విజయవాడ), మురళీకృష్ణ మరియు పి.డి.డి. కుమార్ (గన్నవరం) గార్లు వాక్యపరిచర్య చేసిరి. ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. కేసరిపల్లిలో సోదరులు పి. షడక్ గారు సువార్త చాటుచున్నారు.

2002, మార్చి 3వ తేదీ ఆదివారం రాత్రి రామచంద్రపురం స్టీల్‌వెల్ పేటలో జరిగిన స్తుతి కూటములో సోదరులు జాషువా గూటం గారు వాక్య పరిచర్య చేసిరి. అక్కడ యన్. లాజరస్ గారు, వారి కుమారుడు ప్రసాద్ గారు సువార్త పరిచర్య గావించుచున్నారు. సంఘము అభివృద్ధి జెందుచున్నది.

మార్చి 9వ తేదీ శనివారం క్రొత్త కందరాడ క్రీస్తుసంఘ ఆలయములో సువార్త కూటము జరిగెను. సోదరులు జాషువాగూటం గారు వాక్యపరిచర్య గావించిరి. మరునాడు ఇద్దరు స్త్రీలు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. క్రొత్త కందరాడలో సోదరులు యం. యేసుదాసు గారు సువార్త చాటుచున్నారు.

మార్చి 15వ తేదీ శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురంలో సువార్తికుల సదస్సు ఘనముగా జరిగెను. ఆనాడు "ఆరాధనలో అపొస్తలుల బోధ లేక వాక్యపరిచర్య" అను అంశము చర్చించబడెను. ఆ సదస్సుకు పలుప్రాంతముల నుండి, గ్రామముల నుండి సువార్తికులు సకాలమునకు వచ్చి మంచి సహవాసములోను వాక్య పరిచర్య లోను పాలుపొందిరి. నీలాద్రిపురం క్రీస్తు సంఘస్థులు హాజరైన వారందరికీ మంచి ఆతిథ్యము, చక్కటి భోజన సదుపాయము కల్పించిరి. నీలాద్రిపురంలో సోదరులు కె. రామారావ్ గారు సువార్త చాటుచున్నారు. ఆనాటి సదస్సు రామారావ్‌గారి ప్రార్థనతోనే ప్రారంభమాయెను. తదుపరి సోదరులు యన్. మోజెస్ (కరుగోరుమిల్లి), పి. అబ్రాహాము (విజయవాడ), పి. జాషువా (ప్రత్తిపాడు, ప.గో. జిల్లా), పి. స్తెఫను (కొయ్యేటిపాడు) మరియు టి.వి.యన్ కుమార్ గార్లు వాక్యోపదేశం గావించిరి.

దేవుని యెదుట యోగ్యునిగా కనుబరచుకొనుటకు ఒకడు సత్య వాక్యమును

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 22 ఏప్రియల్ 2002 సంచిక 9

## యేసుక్రీస్తు దేవుని కుమారుడు - 5

### (Jesus Christ, the son of God - 5)

యేసుక్రీస్తు జన్మించిన విధానమును బట్టి, చేసిన అద్భుతక్రియలు, బోధలను బట్టి ఆయన దేవుని కుమారుడని గత సంచికలలో తెలిసికొని యున్నాము. యేసుక్రీస్తు కూడ "దేవుడు తన సొంత తండ్రి అని చెప్పి తన్నుతాను దేవునితో సమానునిగా చేసికొనెను. అందు నిమిత్తము యూదులు ఆయనను చంపవలెనని మరి ఎక్కువగా ప్రయత్నము చేసిరి" (యోహాను 5:18). చివరిగా వారు యేసును పట్టుకొని రోమా గవర్నరయిన పిలాతు నొద్దకు యేసును తీసికొనివచ్చి ఆయనను సిలువ వేయుము, సిలువ వేయుము అని కేకలు వేసిరి. ఆయన యందు నాకు ఏ దోషమును కనబడలేదు అని పిలాతు

అనగా, అందుకు యూదులు మాకొక నియమము కలదు; తాను దేవుని కుమారుడను అని ఇతడు చెప్పుకొనెను గనుక ఆ నియమము చొప్పున ఇతడు చావవలెనని అతనితో చెప్పిరి (యోహాను 19:6-7). యూదులు ద్వేషము వలన యేసును సిలువవేసి చంపిరిగాని, యేసు సమాధి చేయబడిన మూడవ దినమున సమాధిని జయించి సజీవుడై తిరిగి లేచుట ద్వారా దేవుని కుమారుడుగా ప్రభావముతో నిరూపింపబడెను.

యేసుక్రీస్తు దేవుని కుమారుడు అని మనము నమ్మునట్లు యేసును గూర్చి వందలాది సంవత్సరములకు ముందు నుండే దేవుడు తన ప్రవక్తల ద్వారా ప్రవచించెను. బైబిలు నందు యేసుయొక్క జననము, జీవనము, మరణము, పునరుత్థానములను గూర్చిన ప్రవచనము లనేకములున్నవి. వానిలో కొన్ని అవి నెరవేరుసరికి 1500 లేక 1000 సం॥ల కంటె ముందు చెప్పబడినవి. పాతనిబంధనలోని ఆఖరి పుస్తకమయిన మలాకీ గ్రంధము క్రీస్తుకు పూర్వము 450 సం॥లకు ముందే ముగించబడినందున క్రీస్తును గూర్చి చెప్పబడిన ప్రవచనములు అవి నెరవేరుసరికి కనీసము 450 సం॥ల పాతవైయున్నవన్న మాట. దీనిని బట్టి వందలకొలది సం॥లు ముందుగానే దేవుడు తన కుమారుని గూర్చి ప్రజలకు గురుతుల నిచ్చెను అని మనము గ్రహించవలెను. ఇప్పుడు పాతనిబంధనలోని ప్రవచనములను మనము కొన్నింటిని చదివి అవి యేసు క్రీస్తులో ఎట్లు నెరవేరెనో గ్రహించుదాం. పాతనిబంధనలో యున్న ప్రవచనము లన్నింటిని గమనించుటకు మనకు సమయము చాలదు గనుక కొన్నింటిని మాత్రమే గమనించుదాం.

ఆదికాండము 3:15లో జగద్రక్షకుని గూర్చిన మొట్టమొదటి ప్రవచనము మనకు కన్పడుచున్నది. ఆయన స్త్రీ సంతానమై యుండునని (అంటే పురుషుని మూలముగా కలిగిన వాడు కాదు అని) యెహోవా దేవుడు చెప్పెను. అయితే గలతీ 4:4లో మనము చూచిన, "కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను; ఆయన స్త్రీ యందు పుట్టెను" అని పరిశుద్ధాత్ముడు పౌలు

ద్వారా వ్రాయించెను. యేసుక్రీస్తు పురుషుని ఎరుగని కన్యగర్భమున జన్మించెను. అందువలన ఆయన స్త్రీ సంతానమాయెను.

క్రీస్తు బెత్లెహేములో జన్మించును అని మీకా 5:2లో ప్రవచింపబడెను. "రాజైన హేరోదు దినముల యందు యూదయ దేశపు బెత్లెహేములో యేసు పుట్టిన పిమ్మట ఇదిగో తూర్పుదేశపు జ్ఞానులు యెరూషలేమునకు వచ్చిరి" యని మత్తయి 2:1 లో దాని నెరవేర్పు మనకు కన్పడుచున్నది.

యేసును గూర్చి యెషయా ప్రవక్త 700 సం॥లకు ముందే "ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరుపెట్టును" అని ప్రవచించెను (యెష 7:14). ప్రవచింపబడిన రీతిగానే ఆయన కన్యయైన మరియకు జన్మించెను అని మత్తయి 1 అధ్యా., లూకా 1 అధ్యా చదువుట వలన మనము గ్రహించగలము.

యేసు బాలుడై యుండగా ఐగుప్తునకు కొనిపోబడును అని హోషేయ 11:1లో ప్రవచింపబడెను. హేరోదు రాజు పసిబాలుడైన యేసును సంహరింప జూచుచున్నాడని ప్రభువు దూత యోసేపుకు తెలియజేయగానే అతడు లేచి రాత్రివేళ శిశువును, తల్లిని తోడుకొని ఐగుప్తునకు వెళ్లి హేరోదు మరణము వరకు అక్కడ ఉండెను అని మత్తయి 2:14లో మనము చదువగలము.

యేసు యొర్దాను నది అద్దరిని, గలిలయ ప్రదేశమున సువార్త ప్రకటించునని యెషయా 9:1లో ప్రవచింపబడెను. యోహాను చెరపట్టబడెనని యేసు విని గలిలయకు తిరిగివెళ్లెను అని మత్తయి 4:12 దాని నెరవేర్పును మనకు సూచించుచున్నది.

ఆయన తన ప్రజలవలన తృణీకరింపబడుననియు, విసర్జింపబడుననియు యెషయా 53:3లో ప్రవచింపబడితే, "ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపబడలేదు" అని యోహాను వ్రాసెను (యోహాను 1:11).

యేసును తన స్నేహితుడొకడు అప్పగించును అని కీర్త 41:9లో ప్రవచింపబడెను. ఆయన అపొస్తలులగు 12 మందిలో యొకడగు ఇస్కరియోతు యూదా ఆయనను అప్పగించుట ద్వారా అది నెరవేరెను (మార్కు 14:10). యేసును అతడు ముప్పది వెండినాణెములకు అప్పగించునని, ఆ ధనమును, అతడు తిరిగి ఇయ్యగా దానితో కుమ్మరివాని పొలము కొనబడునని జెకర్యా 11:12,13 లో ప్రవచింపబడెను. మత్తయి 27వ అధ్యాయమును మనము చదివిన యెడల యేసును అప్పగించినందుకు ఇస్కరియోతు యూదా పశ్చాత్తాపపడి ఆ ముప్పది వెండినాణెములను యూదుల అధికారులకు తిరిగి ఇయ్యగా వారు ఆలోచనచేసి పరదేశులను పాతిపెట్టుటకు కుమ్మరివాని పొలమును ఆ డబ్బుతో కొనిరి అని మనము గ్రహించగలము.

యేసుపై అబద్ధసాక్షులు లేతురు అని కీర్తన 27:12లో ప్రవచింపబడెను. మత్తయి 26:57-60 వరకు చదివితే యేసును చంపవలెనని ప్రధాన యాజకులును, మహాసభ వారందరును ఆయనకు విరోధముగా అబద్ధ సాక్ష్యము వెదుకగా చివరకు ఇద్దరు మనుష్యులు వచ్చి ఆయన మీద అబద్ధ సాక్ష్యము పల్కినట్లు కనుగొనగలము. అతిక్రమము చేయువారిలో ఆయన ఎంచబడునని యెషయా 53:12 లో ప్రవచింపబడెను. అది నెరవేరునట్లు ఆయన కుడివైపున ఒకడును ఎడమ వైపున ఒకడును ఇద్దరు బందిపోటు దొంగలు ఆయనతో కూడ సిలువ వేయ బడిరి యని మత్తయి, మార్కు, లూకా అనువారు వ్రాసిన సువార్తలలో మనము కనుగొనగలము (మత్తయి 27:38; మార్కు 15:27,28; లూకా 23:33).

ఆయన దప్పిగొనగా ఆయనకు చేదుచిరక ఇత్తురు అని కీర్తనలు 69:21లో దావీదు ప్రవచించెను. యేసు సిలువపై వ్రేలాడుచు నేను దప్పిగొనుచున్నాననెను. వారు ఒక స్పంజీ చిరకతో నింపి, హిస్సోపు పుడకకు తగిలించి ఆయన నోటికి అందించిరి యని యోహాను 19:29లో మనము అది నెరవేరుట చూడ గలము. తన శత్రువుల కొరకు ఆయన ప్రార్థించును అని కీర్తన 109:4లో ప్రవచింప బడెను.

యేసు తనను సిలువ వేసిన వారిని చూచి, "తండ్రీ, వీరేమి చేయు చున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని" ప్రార్థన చేసెను (లూకా 23:34).

దేవుని యొక్క ఏకైక కుమారుడు పొడువబడును అని జెకర్యా 12:10లో ప్రవచింపబడెను. యేసు సిలువ మీద యుండగా "సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కపొడిచెను, వెంటనే రక్తమును నీళ్ళును కారెను" అని యోహాను 19:34లో మనము చూడగలము. యేసు యొక్క యెముకలన్నియు కాపాడ బడును, వాటిలో ఒక్కటియైనను విరిగిపోదు అని నిర్గమ 12:46లోను, కీర్తన 34:20 లోను ప్రవచింపబడెను. యోహాను 19:31-38 వరకు మనము చూచిన సైనికులు వచ్చి యేసుతో కూడా సిలువ వేయబడిన ఇద్దరి కాళ్లను విరుగగొట్టిరి గాని వారు యేసునొద్దకు వచ్చి అంతకుముందే ఆయన మృతిపొంది యుండుట చూచి వారు ఆయన కాళ్ళు విరుగగొట్టలేదు అని గమనించగలము.

యేసు చనిపోయినను తిరిగిలేచును అని కీర్తన 16:10లో ప్రవచింప బడిన రీతిగానే ఆయన సమాధి నుండి సజీవుడై లేచినట్లు మత్తయి, మార్కు, లూకా, యోహానులు వ్రాసిరి. తోమా అను శిష్యుడు ఆయన గాయములలో చేతులుంచి, విశ్వసించి నా ప్రభువా, నా దేవా అని ఆయనను మ్రొక్కెను (మత్తయి 28:9; లూకా 24:36-48, యోహాను 20:26-29).

యేసు సమాధి నుండి తిరిగి లేచిన తరువాత పరలోకమునకు ఆరోహణుడై పోవును అని కీర్తన 68:18లో దావీదు ప్రవచించెను. యేసు తన శిష్యులను "బేతనియవరకు తీసికొనిపోయి చేతులెత్తి వారిని ఆశీర్వదించు చుండగా ఆయన వారిలో నుండి ప్రత్యేకింపబడి పరలోకమునకు ఆరోహణు డాయెను" అని లూకా వ్రాసెను (లూకా 24:50,51; అపొ.కా. 1:9).

పాతనిబంధనలో యేసును గూర్చి వందలకొలది సం॥లకు ముందే చెప్పబడిన అనేక ప్రవచనములలో కొన్నింటిని మాత్రమే మీకు చూపిస్తూ వాటి నెరవేర్పును కూడ క్రొత్తనిబంధనలో నుండి మీకు తెలియజేసాను. ఈ

ప్రవచనములను ప్రవచించిన వాడు, వాటిని అనేక సం॥ల తరువాత నెరవేర్చిన వాడు దేవుడే. అందువలన యేసుక్రీస్తు దేవునిచేత పంపబడిన రక్షకుడని, ఆయనే దేవుని కుమారుడని మనము తప్పక విశ్వసింపవచ్చును గదా.

నెరవేర్చబడిన ఈ ప్రవచనము లన్నియు యేసు దేవుని కుమారుడని నిరూపించుట మాత్రమేగాక, పాతనిబంధనను వ్రాసిన లేఖకులు వారి స్వజ్ఞాన మును బట్టి దానిని వ్రాయలేదు గాని దైవనడిపింపుచే వ్రాసిరి యని అవి దృఢముగా మనకు నిరూపించుచున్నవి. 2 పేతురు 1:20-21 ఇట్లు చెప్పు చున్నది; "ఒకడు తన ఊహాను బట్టి చెప్పుటవలన లేఖనములలో ఏ ప్రవచనము పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగ పలికిరి". అందువలన పాతనిబంధనను మనము చదువునప్పుడు అది మానవకల్పిత గ్రంధమని తలంచక, దైవ ప్రేరిత మైనదని, పరిశుద్ధ గ్రంధమని చదువవలెను.

యేసుక్రీస్తు దేవుని కుమారుడని మనమేల నమ్మవలెను ? ఆయన దేవుని వలన కన్యకు జన్మించినందున, అనేకులు ఆయనే దేవుని కుమారుడని ఇచ్చిన సాక్ష్యము వలన, దేవుడే తన కుమారుని గూర్చి చేసి నెరవేర్చిన ప్రవచనముల వలన ... మనము యేసునందు విశ్వసింపవలెను. అందువలననే యేసు ఇట్లనుచున్నాడు; "మీ హృదయమును కలవరపడ నియ్యకుడి, దేవుని యందు విశ్వాసముంచుచున్నారు. నా యందును విశ్వాసముంచుడి", "నేనే మార్గమును, సత్యమును, జీవమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" (యోహాను 14:1,6). మీరు క్రీస్తు పాదముల యొద్ద కూర్చొని, ఆయన ఆజ్ఞలను విని వాటిని శిరసావహించిన యెడల ఆయనే మీకు మోక్షమును దయ చేయగలడు !

# పరలోకము నుండి కలిగినదా ? మనుష్యుల నుండి కలిగినదా ?

## (From Heaven or Men ?)

## మత్తయి 21:25

యేసు యూదుల దేవాలయము లోనికి వచ్చి బోధించు చుండగా ప్రధాన యాజకులును, ప్రజల పెద్దలును ఆయన యొద్దకువచ్చి - ఏ అధికారము వలన నీవు ఈ కార్యములు చేయుచున్నావు ? ఈ అధికారమెవడు నీకిచ్చెనని ఆయన నడిగిరి. అందుకాయన తిరిగివారినొక ప్రశ్న అడిగెను, వారాయన ప్రశ్నకు జవాబిస్తే, వారి ప్రశ్నకు ఆయన జవాబిత్తునని చెప్పి, "యోహాను ఇచ్చిన బాప్తిస్మము ఎక్కడ నుండి కలిగినది ? పరలోకము నుండి కలిగినదా? లేక మనుష్యుల నుండి కలిగినదా ? యని వారినడిగెను" (మత్త 21:23-25).

ఈ వ్యాసములో కొన్ని సంగతులను గూర్చి అదే ప్రశ్నను వేస్తు లేఖనార్థమైన జవాబులను కూడ తెలిసికొందాము.

1. <u>యోహాను ఇచ్చిన బాప్తిస్మము పరలోకము నుండి కలిగినదా ? లేక మనుష్యుల నుండి కలిగినదా ?</u>

యేసు ఈ ప్రశ్నను యూదుల ప్రధాన యాజకులకు, పెద్దలకు వేసెను. వారాయన ప్రశ్నకు ఎటూ జవాబు చెప్పలేకపోయిరి. "వారు-పరలోకము నుండి అని చెప్పితిమా, ఆయన అలాగైతే మీరెందుకు అతని నమ్మలేదని మనల నడుగును; మనుష్యుల వలనని చెప్పితిమా, జనులకు భయపడుచున్నాము. అందరు యోహాను ప్రవక్తయని ఎంచుచున్నారని తమలో తాము ఆలోచించు కొని మాకు తెలియదని యేసునకుత్తరమిచ్చిరి" (మత్త 21:25-26). ఈ విధంగా వారి కుయుక్తిలో యేసు వారిని కూలద్రోసెను.

యోహాను యిచ్చిన బాప్తిస్మము పరలోకము నుండియే కలిగెను. యేసు యొక్క మార్గమును సరాళము చేయుటకతడు వచ్చెను (మత్త 3:1-3). అతడు మారుమనస్సు నిమిత్తమును, పాపక్షమాపణ నిమిత్తమును బాప్తిస్మమిచ్చెను (మార్కు 1:4,5). యోహాను యిచ్చిన బాప్తిస్మము పొందినవారు; క్రీస్తు సంఘము స్థాపించబడిన తరువాత క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 19:1-5).

యోహాను యేసుకు బాప్తిస్మమిచ్చెను (మత్త 3:13-17). అందువలన యేసు బాప్తిస్టువాడయ్యాడని కొందరు చెబుతారు ! గాని యోహాను అంత బుద్ధిహీనుడేమీ కాదు (మత్త 3:14,15; యోహాను 3:30,31). అతడు యేసుతో సమానుడనని ఎంచుకోలేదు, సరిగదా ఆయన చెప్పుల వారు విప్పుటకైనను పాత్రుడనుకానని చెప్పెను (యోహాను 1:26,27; మత్త 3:11).

యోహాను బాప్తిస్మమిచ్చువాడే గాని బాప్టిస్టుకాదు. బాప్తిస్మమిచ్చు యోహానని బైబిలు అతన్ని గూర్చి చెబుతుంది. చరిత్రప్రకారము 1608వ సం॥లో హాలేండ్‌లో జాన్‌స్మిత్ ద్వారా బాప్టిస్టు సంఘము స్థాపించబడింది. దరిమిలా 1644 తరువాత ఆ సంఘస్థులు బాప్టిస్టులని పిలువబడుటకు మొదలిడిరి.

2. <u>బాప్తిస్మమునకు బదులు చిలకరింపు పరలోకము నుండి కలిగినదా ? మానవుల నుండి కలిగినదా ?</u>

ఒకేఒక్క బాప్తిస్మమున్నది: "ప్రభువు ఒక్కడే, విశ్వాసము ఒక్కటే, బాప్తిస్మము ఒక్కటే" (ఎఫెసీ 4:5).

ఆ ఒకే బాప్తిస్మమునకు, విస్తారమైన నీళ్లు అవుసరం (యోహా 3:23); దానిలో నీటిలోనికి వెడలుట, దానిలో నుండి బయటకు వచ్చుట యుండవలెను (అపొ.కా. 8:38). అదొక నీటి సమాధి (రోమా 6:4), పునరుత్థానము (కొలస్స 2:12), ఒక జన్మ (యోహాను 3:5).

"మీ అపవిత్రత పోవునట్లు నేను మీ మీద శుద్ధజలము చల్లుదును"

అని యెహెజ్కేలు 36:25లో వ్రాయబడినది బాప్తిస్మమును గూర్చి కాదు. సంఖ్యా 19:1-10 చదువండి.

బాప్తిస్మమునకు బదులు చిలకరించే పద్ధతి పరలోకము నుండి కలిగినది కాదు గనుక అది మానవుల నుండియే కలిగినది. నోవేషియన్ అనునతనికి క్రీ॥శ 251లో మొదటిగా చిలకరింపు యిచ్చినట్లు చరిత్ర చెప్పుచున్నది. ప్రభువు కాదు, మానవుడే దాన్ని ప్రవేశపెట్టాడు. రోమన్ కేథలిక్కుల బిషప్ జోసఫ్ హెఫెలి యిట్లు చెప్పాడు: "రోగుల యెడల సంఘము ఎల్లప్పుడు జాలిగొని యున్నది; అందువలన అది చికిత్సపరమైన బాప్తిస్మము ప్రవేశపెట్టినది" (History of Church Councils, Pope 153). చాలకాలము మట్టుకు ఎవరికోగాని చిలకరింపు యిచ్చే వారు కాదు గాని రానురాను అదొక పారంపర్యాచారామై పోయినది.

### 3. శిశు బాప్తిస్మము పరలోకము నుండి కలిగినదా ? మానవుల నుండి కలిగినదా ?

ఎవరైనా లేఖనముల ప్రకారము బాప్తిస్మము పొందకముందు అతడు వాక్యమును వినాలి (రోమా 10:17), విశ్వసించాలి (యోహాను 8:34), మారు మనస్సు పొందాలి (అ.పొ.కా. 2:28) మరియు బాప్తిస్మము పొందాలి (మార్కు 16:16). శిశువు ఈ సంగతులను చేయలేడు గనుక అతనికి బాప్తిస్మమియ్య కూడదు.

శిశు బాప్తిస్మము పరలోకము నుండి కలిగినది కాదు. అది మానవుల నుండియే కలిగినది. శిశు బాప్తిస్మము క్రీస్తు సంఘము స్థాపించబడిన మూడు వందల సం॥ల తరువాత నెమ్మదిగా ప్రవేశపెట్టబడెను. పసిబిడ్డలు జన్మ పాపము తో పుడతారనే దురభిప్రాయముపై ఆధారపడి, పసిపిల్లలకు బాప్తిస్మమిచ్చుట కారంభించిరి. ఆదిమ పాపము నుండి పసిబిడ్డలు కడుగబడాలి, గనుక వారు బాప్తిస్మము పొందుట కర్తవ్యమని జాన్‌వెస్లీ అనునతడు బోధించాడు. అతని ఉపదేశం లేఖన విరుద్ధం. మానవుడు పాపమును వారసత్వముగా పొందడు. ఎవడు పాపము చేయునో, వాడే శిక్షించబడును (యెహెజ్కేలు 18:20).

4. క్రైస్తవారాధనలో వాద్యసంగీతము - పరలోకము నుండి కలిగినదా ? మానవుల నుండి కలిగినదా ?

ఆరాధనలో వాద్యసంగీతమును గూర్చి క్రొత్తనిబంధనలో ఎక్కడా కనబడదు. గనుక అది మానవకల్పితమే. సంగీతమును గూర్చి క్రొత్తనిబంధనలో యున్న ప్రతిలేఖనము గాత్రమును గూర్చియే చెప్పబడియున్నది గాని వాద్యసంగీతమును గూర్చికాదు. దిగువ లేఖనభాగములను చూడుము: మత్తయి 26:30; అపొ.కా. 16:25; రోమా 15:9; 1 కొరింథీ 14:15; ఎఫెసీ 5:19; కొలస్స 3:16; హెబ్రీ 2:12, 13:15; యాకోబు 5:13.

క్రైస్తవరాధనలో వాద్యసంగీతము తప్పకుండా మానవకల్పితమే. ఆరవ శతాబ్దపు ఆరంభదశలో ఆరాధనలోనికి వాద్యములు ప్రవేశపెట్టబడినట్లు చరిత్ర సాక్ష్యమిచ్చుచున్నది. కేథలిక్కు సంఘమునుండి వెడలివచ్చిన సవరణోద్యమ నాయకులు వాద్యసంగీతం విగ్రహారాధనతో సమానమని తలంచిరి. వాద్యములు బయలు దేవతా పరికరములని మార్టిన్ లూథరు అన్నాడు. ధూపదీపాలు, సాంబ్రాణి పొగలు క్రైస్తవరాధనలో ఎట్లు భాగముకాదో, అట్లే వాద్యములు కూడానని జాన్‌కేల్విన్ చెప్పాడు. వాద్యములు మన ఆలయములలో యుండి కనబడకను, వినబడకను ఉంటే అభ్యంతరంలేదని జాన్‌వెస్లీ చెప్పాడు. అవి మానవకల్పితములే.

5. విశ్వాసము మూలమున మాత్రమే *(faith only)* రక్షణ యను బోధ పరలోకము నుండి కలిగినదా ? మానవుల నుండి కలిగినదా ?

విశ్వాసము ద్వారా రక్షణ కలుగునని లేఖనములు బోధించుచున్నవి (యోహాను 3:16; రోమా 5:1; అపొ.కా. 16:31; హెబ్రీ 11:6). అయితే విశ్వాసము వలన మాత్రమే రక్షింపబడుదుమని, లేక నీతిమంతులుగా తీర్చబడదుమని చెప్పే వచనము ఒక్కటి కూడా లేదు. విశ్వాసము వలన మాత్రమే యను సూత్రమును, పదజాలమును మార్టిన్ లూథరు ప్రవేశపెట్టెను. క్రియల వలన మాత్రమే యను

కేథలిక్కుల అబద్ధ సిద్ధాంతమును కాదనుటకు లూథరు విశ్వాసము వలన మాత్రమే రక్షణ యను సిద్ధాంతము ప్రవేశపెట్టెను. చదువరి దిగువ వచనములు గమనించవలెను (యాకోబు 2:17,19,24,26).

విధేయత చూపు విశ్వాసము వలన మానవుడు రక్షించబడును. యేసు తనకు విధేయులైన వారందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:10). "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోకమందు చేరడు గాని, పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించునని" యేసు చెప్పెను (మత్త 7:21). యెరికో గోడలు విశ్వాసము వలన కూలెను, గాని యెప్పుడు ? విశ్వాసముతో షరతులకు వారులోబడినప్పుడు (యెహోషువా 6; హెబ్రీ 11:30). మనుష్యుని విశ్వాసము విధేయతకు నడిపించనప్పుడు, రక్షణ కలుగదు, ఒకడు విశ్వసించ వచ్చును గాని నశించవచ్చును. యూదుల అధికారులలో అనేకులు యేసునందు విశ్వాసముంచిరి గాని ప్రజలకు భయపడి వారాయనకు లోబడలేదు (యోహా 12:42-43).

## 6. మతశాఖలు ఎక్కడ నుండి కలిగినవి ? పరలోకము నుండి కలిగెనా ? లేక మానవుల నుండి కలిగెనా ?

అవి పరలోకము నుండి కలుగలేదు. ఏలయనగా, దేవుడు ఒకేఒక్క సంఘమును స్థాపించారు (మత్త 16:18; రోమా 12:4,5). విశ్వాసము ఒక్కటే, బాప్తిస్మము ఒక్కటే (ఎఫెసీ 4:5). మతశాఖల తత్వాన్ని బైబిలు ఖండించుచున్నది (1 కొరింథీ 1:10-13). క్రీస్తు ఏకత్వము కొరకు ప్రార్థించారు (యోహాను 17:20-21).

గనుక క్రైస్తవ్యము శాఖలుగా విడిపోయిందంటే, అది మానవులు చేసిన పనే. నిజమైన క్రీస్తు సంఘమునుండి ప్రవచింపబడిన రీతిగనే విశ్వాసభ్రష్టత్వ సంఘము ఏర్పడెను (1 తిమో 4:1-3; 2 థెస్స 2:3-4). రోమన్ కేథలిక్కుల నుండి ప్రొటెస్టాంటుల సంఘము లేర్పడెను. అయితే ఆదిలో క్రీస్తు అనుచరులు

కేథలిక్కులని, ప్రొటెస్టాంటులనీ గాక క్రైస్తవులని మాత్రమే పిలువబడిరి (అపొ.కా 11:26). మనము శుద్ధమైన దేవుని వాక్యమునే విత్తితే క్రైస్తవులు మాత్రమే తయారవుతారు. దీనిని మేము చేశాం. అందువలన మేము కేథలిక్కులము కాదు, ప్రొటెస్టాంటులము కాదు, గాని క్రైస్తవులము మాత్రమే.

-- లీరోయ్ బ్రౌన్లో

# ఆరాధనలో చప్పట్లు కొట్టవచ్చునా ?

## (Is Hand clapping approved in Worship ?)

బహిరంగ సభలలో ప్రజలు చప్పట్లు ఎందుకు కొడతారు ? సాధారణంగా ప్రసంగీకుడు చెప్పిన మాటలను హర్షిస్తు చప్పట్లు కొడతారు. ప్రసంగీకుడు తన ప్రసంగాన్ని ముగించినప్పుడు హర్షిస్తు చప్పట్లు కొడతారు. తద్వారా తమ ఆమోదాన్ని అతనికి తెలియజేయుదురు. అయితే సంఘారాధనలో చప్పట్లు కొట్టుటకు మనకు లేఖనార్థమైన అధికారం యేమైనావున్నదా ?

బైబిలు మాట్లాడు చోట మనం మాట్లాడుదాం, అది మౌనియైన చోట మనం మౌనులమవుదాం అను సూత్రాన్ని మనం పాటిస్తే ఆరాధన విషయంలో దేవుని చిత్తాన్ని మనం గ్రహించుట కది దోహదపడును. ఇంకో మాటలో దేవుడు మనకు ఒక ఆజ్ఞ ద్వారా గాని, ఉదాహరణ ద్వారా గాని, లేదా ఆయన వాక్యంలో ఇమిడియున్న సూత్రము ద్వారా గాని దేనినైనా బోధించినప్పుడు, దాన్ని చేయుటకు మనకు లేఖనార్థమైన అధికారం ఉండును. అట్లుకానిచో, మనం లేఖనాలకు విరుద్ధంగా ప్రవర్తించు వారమవుదుము.

ఆరాధనలో మన ఏకీభావాన్ని సరిగ ఎట్లు చూపించగలము ? దాని జవాబు 1 కొరింథీ 14:16లో యున్నది. పౌలు ఇట్లు వ్రాసాడు: "లేని యెడల నీవు ఆత్మతో స్తోత్రము చేసినప్పుడు ఉపదేశము పొందనివాడు నీవు చెప్పుదానిని గ్రహింపలేడు గనుక నీవు కృతజ్ఞతా స్తుతులు చెల్లించినప్పుడు - ఆమేన్ అని వాడేలాగు పలుకును ?" అని అక్కడ వ్రాయబడి యున్నది. అంటే ఒకడు చెప్పుదానితో ఏకీభవించునప్పుడు 'ఆమేన్' అని చెప్పాలని పౌలు బోధించుచున్నాడు.

ఏ రీతిగనైనా మీ ఏకీభవాన్ని తెలియజేయుడియని ప్రభువు మనకు చెబితే, అప్పుడు చప్పట్లుకొట్టడం, ఈల వేయడం సరియే. గాని ప్రభువు 'ఏకీభావం చూపండి' అని చెప్పేయలేదు, గాని ఆమేన్ అని చెప్పి మీ ఏకీభావాన్ని చూపండి యని ఆయన మనకు తెలియజేసారు.

ఈ సూత్రం ఆదికాండం 6:14లో మనకు విపులీకరించబడింది. "చితిసారకపు మ్రానుతో నీ కొరకు ఓడను చేసి కొనుము" అని దేవుడు నోవహుతో చెప్పారు. ఏ కర్రతో ఓడను చేయాలో దేవుడు ప్రత్యేకంగా ఆజ్ఞాపించినందున నోవహు మరొక కర్రను వాడకూడదు, వాడలేదు. అట్లే క్రొత్తనిబంధన ఆరాధనలో ఏకీభావాన్ని ప్రకటించాలంటే ఆమేన్ అని చెప్పాలని ప్రభువు ఆజ్ఞాపించినందున, వేరే విధంగా దానిని మనం ప్రకటించరాదు. నీ ఏకీభావాన్ని "చప్పట్లు కొట్టుట ద్వారా తెలియజేయరాదు" అని దేవుడు తెలియ జేయనక్కర్లేదు. ఏలయనగా ఆమేన్ అని చెప్పుట ద్వారా ఆయన దాన్ని తెలియ జేయమన్నప్పుడు చప్పట్లు మొదలగునవి బహిష్కరింపబడ్తాయి.

"మరియు మాటచేతగాని, క్రియచేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరట చేయుడి" యని పౌలు చెప్పాడు (కొలస్స 3:17). ఆయన పేరట చేయుడి అంటే ఆయన అధికారము చొప్పున చేయుడియని అర్థము. అందువలన క్రొత్తనిబంధన ఆరాధనలో మనం చేయు ప్రతి సంగతి ఆయన

అధికారము బడసినదై యుండాలి. గనుక ఆరాధనలో చప్పట్లు కొట్టే అధికారం మనకిచ్చే లేఖనభాగం ఎక్కడున్నది ? క్రొత్తనిబంధనలో ఎక్కడాలేదు.

దేవుని వాక్యాన్ని బట్టి దిగువ సంగతులను దయచేసి గమనించండి:

1. దైవజనుడు ప్రతిసత్కార్యము చేయుటకు ప్రతి లేఖనము ఇయ్యబడినది (2 తిమో 3:16,17).
సంఘారాధనలో చప్పట్లు కొట్టే అనుమతిని లేఖనములు ఎక్కడా ఇయ్యలేదు.
గనుక చప్పట్లు సత్క్రియ కాదు !
లేఖనములలో లేనిదాన్ని చేస్తే లేఖనములను వ్యతిరేకించినట్లే ! (1 కొరింథీ 4:6; 2 యోహాను :9).

ఆరాధనలో చప్పట్లు కొట్టుటను గూర్చి క్రొత్తనిబంధనలో ఎక్కడా వ్రాయబడలేదు. గనుక చప్పట్లు కొట్టుట క్రొత్తనిబంధనను వ్యతిరేకించుటయే:

2. దేవుని వాక్యము వినుట వలన విశ్వాసము కలుగును (రోమా 10:17).
విశ్వాసమూలము కానిదేదో అది పాపము (రోమా 14:23).
సంఘారాధనలో చప్పట్లు కొట్టుటను గూర్చి దేవుని వాక్యంలో ఎక్కడా చెప్పబడలేదు.
గనుక చప్పట్లు కొట్టుట విశ్వాసమూలము కాదు. గనుక అది పాపము!

3. మన జీవముకు భక్తికి కావలసినవన్నీ దేవుడు మనకు తన వాక్యము ద్వారా అనుగ్రహించారు (2 పేతురు 1:3).
అయితే ఆరాధనలో చప్పట్లు కొట్టుటను గూర్చి దేవుని వాక్యంలో మనకు యేమీ ఇయ్యబడలేదు.
అందువలన సంఘారాధనలో చప్పట్లు కొట్టుట మన జీవముకు భక్తికి మూలము కాదు !

పాతనిబంధనలో చప్పట్లు కొట్టుటను గూర్చి చెప్పబడింది కదా ? యని

కొందరు వాదిస్తారు. "సర్వజనులారా, చప్పట్లు కొట్టుడి" యని కీర్తన 47:1 లో యున్నది, నిజమే. గాని సంఘారాధనలో దాన్ని చేయుటకు అది మనకు అధికారం అనుగ్రహించుటలేదు. పాతనిబంధన ఇశ్రాయేలీయులకే ఈయబడెను. అది ఎత్తివేయబడి దానికంటే శ్రేష్టమైన క్రొత్తనిబంధన ఈయబడినది (కొలస్స 2:14; హెబ్రీ 7:12, 8:6-13). పాతనిబంధన కాలంలో సాంబ్రాణి పొగలు, పశుబలులున్నను వాటిని క్రొత్తనిబంధన ఆరాధనలో ఎట్లు ఆచరించలేమో అట్లే పాతనిబంధన కాలంలో చప్పట్లు కొట్టినట్లున్నంత మాత్రాన దాన్ని క్రొత్తనిబంధన ఆరాధనలోనికి తీసికొనిరాలేము. సాంబ్రాణి పొగలను, పశుబలులను మనం ఎట్లు విడిచిపెట్టామో, అట్లే చప్పట్లు కొట్టుటను కూడ విడిచిపెట్టాలి. దాన్ని గూర్చి క్రొత్తనిబందనలో ఆజ్ఞగాని, ఉదాహరణ గాని, లేదా కనీసమాత్రపు సూత్రము గాని లేదు. నేటి ఆరాధనలో చప్పట్లు కొట్టువారు క్రొత్తనిబంధన ఆరాధన క్రమమును భంగపరుచుదురు; దేవుని వాక్యమును ఎదురాడుదురు. "ఏలయనగా ఆయన మనుష్యుల చేతులతో సేవింపబడు వాడు కాడు" (అపొ.కా. 17:25).

మనం దేవుని ఆరాధించునప్పుడు ఆయన క్రొత్తనిబంధనలో మనకు దేనిని బయలుపరచారో దానినే అనుసరించాలి. ఆరాధనలో చప్పట్లు ఒక భాగంగా క్రొత్తనిబంధన పేర్కొనలేదు. అందువలన దేవుని సంతోష పెట్టాలంటే దాన్ని ఆరాధనలోనికి తీసికొనిరాకూడదు. మనం ఆయన వాక్యాన్ని గౌరవించా లని దేవుడు కోరుచున్నారు. దానికి కలిపినా, దాని నుండి తీసివేసినా దేవుని ఉగ్రతను మనం ఆహ్వానించిన వారమవుతాము. తత్ఫలితముగా పరిశుద్ధ (పరలోక) పట్టణములో ప్రవేశమును కోల్పోయిన వారమవుతాము (ప్రక 22:18-19).

(TFW)

# ప్రార్థన
## (Prayer)

"ప్రార్థన" అంటే "మనవి" చేయుట అని అర్థము. ఇది విశ్వసించిన వారికి ఇవ్వబడిన ఆజ్ఞలలో ఒకటి. ఆదిమ క్రీస్తుసంఘము "అపొస్తలుల బోధ యందును సహవాసమందును, రొట్టెవిరుచుట యందును ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి" అని వ్రాయబడింది (అపొ.కా. 2:42).

ప్రార్థనను గూర్చి లేఖనాలు అందించే సత్యాన్ని గ్రహింపకయే అనేకులు "ప్రార్థన" ను తమ స్వప్రయోజనాలకు వినియోగించు కొనుచూ లేఖనములను నిరర్థకము చేయుచున్నారు. ప్రార్థన ఎలా చేయాలి ? ఎలా చేయకూడదు ? ఎవరి నిమిత్తమై ప్రార్థించాలి ? ఎవరి నిమిత్తమై ప్రార్థించకూడదు ? అనే ప్రశ్నలకు జవాబును దేవుని వాక్యపు వెలుగులో కనుగొనాలి. అలా చేయనప్పుడు మనం చేసే ప్రార్థన దేవునికి చేరదు. "ఆయన చిత్తానుసారముగ మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించును" 1 యోహా 5:14. మన ప్రార్థన ఆయన చిత్తానుసారముగా ఉండాలనేది లేఖనాల సందేశం.

"నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహుబలము కలదై యుండును" యాకో 5:16. ఇక్కడ "నీతిమంతుడు" అను పదం క్రైస్తవుని గూర్చి చెప్పబడింది. లేఖనాలను పరిశీలిద్దాం. "మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా ? అతడు ప్రార్థన చేయవలెను.... (యాకోబు 5:14). "మీలో" అంటే "సంఘములో" అని అర్థము. మనము విశ్వాస గృహములో అనగా సంఘములో ఉన్న విశ్వాసులు అస్వస్థతకు గురి యైతే ప్రార్థించాలి. పరిశుద్ధ లేఖనములను అతిక్రమించి స్వార్థపరులై ఎవరి నిమిత్తమైనా, దేని నిమిత్తమైనా ప్రార్థించేవారు సత్యసంబంధులు కారు.

కేవలము రోగము స్వస్థపరచబడు నిమిత్తము బంగారము, వెండి మరియు వస్త్రములను కానుకలుగా పట్టుకొని తన పరివారముతో షోమ్రోను బయలుదేరిన నయమాను తన ప్రయాణమందు యిట్టి మనోభావమును కలిగియుండెను. "అతడు నాయొద్దకు వచ్చి నిలిచి, తన దేవుడైన యెహోవా నామమును బట్టి తన చెయ్యి రోగముగా ఉన్న స్థలము మీద ఆడించి కుష్ఠ రోగమును మాన్పునని నేననుకొంటిని" 2 రాజులు 5:11. యిది అతని మనో భావము, కాని ఇతడు శుద్ధుడగుటకు దేవుని సంకల్పము వేరుగా ఉన్నది. దేవుని సంకల్పమును కాదని తన మనోభావాన్ని ఇతడు అనుసరించిన యెడల ఇతడు శుద్ధుడు కాలేక యుండెడివాడు.

ప్రజల కానుకలను, ధనసంపాదనను ఆశించి ప్రార్థించేవారు గేహజీ వంటివారు. అతని పాపము యొక్క పర్యవసానము మిక్కిలి భయంకరమైనది.

ప్రార్థన దేవునికి తన కుమారులైన విశ్వాసులు చేయునట్టి విజ్ఞాపనము లేదా విన్నపము. "విశ్వాస సహితమైన ప్రార్థన ఆ రోగిని స్వస్థపరచును" యాకోబు (5:17). ప్రార్థన విశ్వాససహితమైనదిగా ఉండాలి. మీరు ఒకని కొరకు ఒకడు ప్రార్థన చేయాలి.

"యెడతెగక ప్రార్థన చేయుడి. ప్రతి విషయమందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఈలాగు చేయుట యేసుక్రీస్తు నందు మీ విషయములో దేవుని చిత్తము" 1 థెస్స 5:16-18.

మనం పరలోకమందున్న తండ్రికి ఆయన కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా ప్రార్థించాలి. ఈ ప్రార్థన దేవునికి మనం చేసే విజ్ఞాపన గనుక సంఘానికి తెలియ జేయవలసిన సమాచారమున్న యెడల దానిని ప్రార్థనలలో పొందుపరచ కూడదు.

"స్వస్థత" అను నినాదంతో ప్రార్థనను వ్యాపార ధోరణికి మార్చుచున్న అనేకులు అబద్ధ ప్రవక్తలైయున్నారు.

వేషధారుల ప్రార్థనలను గూర్చి ప్రభువు హెచ్చరించెను. "మీరు ప్రార్థన చేయునప్పుడు వేషధారులవలె ఉండవద్దు. మనుష్యులకు కనబడవలెనని సమాజ మందిరములలోను వీధుల మూలలలోను నిలిచి ప్రార్థన చేయుట వారి కిష్టము. వారు తమ ఫలము పొంది యున్నారని మీతో చెప్పుచున్నాను" మత్త 6:5.

ప్రార్థన అనేది దేవుడు మనకిచ్చిన ఆదరణకరమైన ఆజ్ఞ. ఆయన చిత్తానుసారంగా మన ప్రార్థన ఉండేటట్లు జాగ్రత్తపడవలసియున్నది. నిరీక్షణ గలవారమై సంతోషించుచు, శ్రమయందు ఓర్పుగలవారమై, ప్రార్థనయందు పట్టుదల కలిగియుందము.

-- ఇ.కె.వి. ప్రసాదరావు,
చెయ్యేరు.

## బైబిలు ప్రశ్నోపనిషత్

1. దిగంబర నరనారీమణులు వారు
తల్లిలేకుండా వచ్చి - తనువంతా ఒక్కటై
మనస్సులో తమస్సుకు చోటిచ్చి - మరణించిన దెవ్వరు ?

2. బ్రతికినంతకాలం భక్తిగా జీవించి
చావును దాటిపోయిన చరితార్థులెవ్వరు ?

3. తోలుదట్టి రోమ వస్త్రం కట్టి
తేనె మిడతల్ని తినేవాడు - పాప
క్షాళనకై నీళ్లల్లో ముంచేవాడు
పెండ్లికుమారుడికి స్నేహితుడెవ్వరు ?

4. రక్షణకర్తను గూర్చి ప్రకటిస్తూ
రాళ్లదెబ్బలు తిని చస్తూ .......
పగతుల మన్నింపుమని
మోకాళ్లూని ప్రార్థించినదెవ్వరు ?

5. ఆసక్తితో వాక్యమును అంగీకరించారు
ప్రతిదినం లేఖనములు పరిశీలించారు
వీరు వారికంటె ఘనులని పొగడబడ్డారు
ఏ ఊరువారు ? ఎక్కడున్నారు ఆ క్రైస్తవులు ?

<u>లేఖన ఆధారములు</u> :-

1. ఆది 2:24-25, 5:1-5
2. ఆది 5:21-24; హెబ్రీ 11:5; 1 రాజ 17-21 అధ్యా 2 రాజులు 2:1-11.
3. లూకా 1:14-17; మార్కు 1:1-8; మత్త 3:1-6; యోహా 3:29.
4. అపొ.కా 6-7 అధ్యాయము
5. అపొ.కా. 17:10-12.

-- సామ్యూల్ జాన్ మేడిది,
కొత్తవాడ.

# యేసును సిలువ వేసిన దేమిటి ?

## (What Crucified Christ ?)

యేసుక్రీస్తు 33 1/2 సం॥లు ఈ లోకములో జీవించెను. ఆయన జీవించి నంత కాలము మనుష్యులకు మేలుచేసి సంచరించెను. ఆయన జీవితంలోని ఆఖరి 3 1/2 సం॥లు బహిరంగముగా సువార్త ప్రకటించెను. ఆయన బోధించు చున్న రీతిని బట్టియు, చేయుచున్న సూచకక్రియలను బట్టియు వేలకొలది ప్రజలు ఆయనను వెంబడించు చుండిరి. అయితే యూదుల ప్రధాన యాజకు లకును, అధికారులకును ఆయనపై గొప్ప ద్వేషముండెను. వారు యేసుపై ఏదైనను నేరము మోపి చంపవలెనని రోమా గవర్నరయిన పిలాతు నొద్దకు తీసికొని వచ్చిరి. పిలాతు ఆయనను విమర్శింపగా ఆయనలో నేరము ఒకట యైనను అతనికి కనుబడలేదు. అయినను యేసును శిక్షించి విడుదల చేయుదు నని అతడు ప్రజలతో చెప్పగా వారు యేసును చంపివేసి నరహత్య విషయమై చెరసాలలో వేయబడిన బరబ్బ అనునతని విడుదల చేయమని కోరిరి. పిలాతు యేసును విడుదల చేయగోరి వారితో తిరిగి మాటలాడినను వారు - వీనిని సిలువ వేయుము, సిలువ వేయుము అని కేకలు వేసిరి. పిలాతు ఎన్ని చెప్పినను వారు వినక ఒకే పట్టున పెద్దకేకలు వేసిర, వీనిని సిలువ వేయుమని అడుగగా వారికేకలే గెలిచెను. వారు కపాలమను స్థలము నందు యేసును సిలువ వేసిరి (లూకా 23:1-33).

యేసు నీకొరకు, నాకొరకు తన పరిశుద్ధ రక్తమును ఆ సిలువపై చిందించెను. నిజానికి మనందరి పాపము వలన ఆయన సిలువ వేయబడెను. అయితే ఆయనను సిలువపై క్రూరముగ హింసించిన కొన్ని సంగతులు కలవు. ఆనాడు యూదులు క్రీస్తును ఎట్లయితే సిలువ వేసిరో, ఈనాడు మనమును ఆయనను సిలువ వేయుచున్నామని వాక్యము చెప్పుచున్నది; "ఒకసారి వెలిగింప బడి పరలోక సంబంధమైన వరమును రుచిచూచి పరిశుద్ధాత్మలో పాలివారై

దేవుని దివ్యవాక్యమును రాబోవు యుగ సంబంధమైన శక్తుల ప్రభావమును అనుభవించిన తరువాత తప్పిపోయిన వారు తమ విషయములో దేవుని కుమారుని మరల సిలువ వేయుచు బాహాటముగా ఆయనను అవమాన పరచుచున్నారు" (హెబ్రీ 6:4-6). గనుక దేవుని కుమారుడైన క్రీస్తును సిలువ వేసినట్టియు, వేయుచున్నట్టియు కొన్ని సంగతులను మనము తెలిసికొనుట మంచిది. వాటి నుండి తొలగిపోవుట మనకెంతయో మేలు.

## అజ్ఞానము

అజ్ఞానమువలన యూదులు యేసును సిలువకు అప్పగించిరి. "ఆయన లోకములో ఉండెను, లోకమాయన మూలముగా కలిగెనుగాని లోకమాయనను తెలిసికొనలేదు. ఆయన తన స్వకీయుల యొద్దకువచ్చెను; ఆయన స్వకీయులు ఆయనను అంగీకరింపలేదు" (యోహా 1:10-11). యేసును గూర్చి మనము అజ్ఞానులమై యున్నయెడల దేవుడికి సహించడు. "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను, అందరును మారుమనస్సు పొందవలెని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ.కా. 17:30). మనము సత్యమును తెలిసికొనవలెనని యేసు కోరుచున్నాడు; "మీరు సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" అని ఆయన బోధించెను (యోహా 8:32). మనము సత్యమును ప్రేమించి, విశ్వసించి, దానికి విధేయులు కావలెనని దేవుడు కోరుచున్నారు (2 థెస్స 2:10-12; 1 పేతురు 1:22). దేవుని కుమారుని గూర్చిన అజ్ఞానము వలన యూదులు ఆయనను సిలువవేసిరి. ఆయనను గూర్చి అజ్ఞానులమై మన ముండిన యెడల మనమును ఆయనను మరల సిలువ వేసిన వారమగుదుము.

## ద్వేషము

ద్వేషము వలన యూదులు యేసును సిలువవేసిరి. తాను దేవుని

నుండి వచ్చిన వాదనని యేసు బోధించుటచేత యూదులు ఆయనను ద్వేషించిరి. "నా బోధ నాదికాదు, నన్ను పంపినవానిదే ... తనంతట తానే బోధించువాడు స్వకీయ మహిమనువెదకును గాని తన్ను పంపినవాని మహిమను వెదకువాడు సత్యవంతుడు. ఆయనయందు ఏదుర్నీతియు లేదు" అని యేసు బోధించెను (యోహాను 7:16-18). వారి క్రియలు చెడ్డవైనందున యూదులు ఈ మాటలు విని యేసును ద్వేషించిరి. "వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి" (యోహా 3:19). ఆనాడు దుర్నీతిచే యూదులు యేసును ఎట్లు అడ్డగించిరో ఈనాడును దుర్నీతి వలన మనుష్యులు సత్యమును అడ్డగించుచున్నారు. అయితే "దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యుల యొక్క సమస్త భక్తిహీనత మీదను, దుర్నీతి మీదను దేవుని కోపము పరలోకము నుండి బయలు పరచబడబోవుచున్నది" అని దైవ వేదము బోధించుచున్నది (రోమా 1:18).

## అసూయ

మత సంబంధమైన అసూయ చేత యూదులు యేసును సిలువ వేసిరి. కేకలు వేయుచున్న జనసమూహములను చూచి పిలాతు, నేనెవరిని విడుదల చేయవలెనని మీరు కోరుచున్నారు ? బరబ్బానా ? లేక క్రీస్తునబడిన యేసునా? అని వారిని అడిగెను. ఏలయనగా వారు అసూయ చేత ఆయనను అప్పగించిరని అతడు ఎరిగి యుండెను (మత్త 27:17-18). అపొస్తలుల కాలములో కూడ మతసంబంధమైన అసూయ ప్రబలి యుండెను. పిసిదియలోని అంతియొకయ పట్టణములో పౌలు, బర్నబాలు సువార్త ప్రకటించుచుండగా దాదాపు ఆ పట్టణమంతయు వినుటకు కూడివచ్చెను. గాని యూదులు జనసమూహములను చూచి మత్సరముతో నిండుకొని, దూషించుచు పౌలు చెప్పిన వాటికి అడ్డము చెప్పిరి. అందువలన వారు అక్కడ నుండి లేచి అన్యజనుల యొద్దకు వెళ్లిరి (అపొ.కా. 14:44-47). అసూయ వలన ఆ యూదులు సువార్త సత్యము ప్రకటింపబడకుండ అడ్డుకొనిరి. ఈనాడు కూడా క్రీస్తును గూర్చిన

సువార్త ప్రకటింపబడుచుండగా అసూయతో ప్రవర్తించు వారనేకులున్నారు. క్రీస్తు సంఘమును గూర్చిన సత్యము వినబడకుండా చెవులు మూసికొను వారు లేకపోలేదు. అయితే అట్టివారు తమ చెడుతనమును విసర్జించి సత్యమును విని దానికి విధేయత చూపించవలెనని ప్రభువు కోరుచున్నాడు. అసూయ అనునది గలతీ 5:20లో చెప్పబడిన ప్రకారము శరీర కార్యములలో ఒకటై యున్నది. అయితే అసూయ గలవారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని దైవవేదము బోధించుచున్నది. అసూయ కలిగినవారు అలనాటి యూదుల వలెనే క్రీస్తును మరల సిలువ వేయు వారగుదురు.

## అబద్ధ సాక్ష్యం

అబద్ధ సాక్షుల వలన యేసును యూదులు సిలువ వేసిరి. "ప్రధాన యాజకులును, మహాసభ వారందరును, యేసును చంపవలెనని, ఆయనకు విరోధముగా అబద్ధ సాక్ష్యము వెదకుచుండిరి గాని అబద్ధ సాక్షులనేకులు వచ్చినను సాక్ష్యమేమియు దొరుకలేదు, తుదకు ఇద్దరు సాక్షులు వచ్చి - వీడు దేవాలయమును పడగొట్టి మూడు దినములలో దానిని కట్టగలననెనని చెప్పిరి' ' (మత్త 26:59,60). ఆనాడు అబద్ధ సాక్షుల వలన క్రీస్తు ఎట్లు హింసింపబడెనో, ఈనాడు అబద్ధ ప్రవక్తల వలన కూడ ఆయన హింసింపబడుచున్నాడు. అందుకే "అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడుడి. వారు గొర్రెల చర్మములు వేసికొని మీయొద్దకు వత్తురుగాని లోపలవారు క్రూరమైన తోడేళ్లు" అని యేసు ముందుగనే మనలను హెచ్చరించెను (మత్తయి 7:15). అపొ. పేతురు ఇట్లనుచున్నాడు: "అటువలెనే మీలోను అబద్ధబోధకులుందురు; వీరు తమ్మును కొనిన ప్రభువును కూడ విసర్జించుచు తమకుతామే శీఘ్రముగా నాశనము కలుగజేసికొనుచు, నాశనకరమగు భిన్నాభిప్రాయములను రహస్యముగా బోధింతురు. మరియు అనేకులు వారిపోకిరిచేష్టలను అనుసరించి నడుతురు; వీరిని బట్టి సత్యమార్గము దూషింపబడును" (2 పేతురు 2:1-3).

అబద్ధ ప్రవక్తలు, బోధకులు లోకములో పెక్కు సంఖ్యాకులుగా యున్నందున

వారిని, వారి బోధలను దేవుని గ్రంథమును బట్టి పరిశీలించు బాధ్యత మనదై యున్నది. "ప్రియులారా, అనేకులైన అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్లియున్నారు గనుక ప్రతి ఆత్మను నమ్మక, ఆయా ఆత్మలు (లేక బోధలు) దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుడి" యని భక్తుడైన యోహాను హెచ్చరించు చున్నాడు (1 యోహాను 4:1).

మిత్రుడా, నీవు క్రీస్తు విషయమై, ఆయన సంఘము విషయమై అజ్ఞానమును గాని, ద్వేషమును గాని, అసూయను గాని కలిగియుండి అసత్యమును నమ్ముచు ప్రకటించుచున్న యెడల నీ ఆత్మను గూర్చి జాగ్రత్తపడుము. క్రీస్తు యేసు దేవుని కుమారుడని విశ్వసించుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము. క్రీస్తు నామమును మనుష్యుల యెదుట ఒప్పు కొనుచూ క్రీస్తులోనికి ముంచడము పొందుము. అప్పుడు నీ పాపముల కొరకై సిలువ వేయబడిన క్రీస్తు నిన్ను రక్షించును.

-- జిఘని గౌతం.

## మీ సంఘమునకు ఒక మంచి అవకాశము !!

మీ స్థానిక సంఘములో చదువుకొన్న వారందరి దగ్గరా బైబిలు వున్నాదా? లేకపోయినచో వారందరికీ బైబిళ్లను మేము ఉచితముగా ఇయ్యగలము. వారిని **బేసిక్ బైబిలు కోర్సు** లో చేర్పించండి. దానిలో 28 పాఠములను పూర్తి చేస్తే వెంటనే బైబిలు ప్రతిని ఉచితంగా వారికి అందజేస్తాము. వారి అడ్రసులను వారి అనుమతితోనే దిగువ చిరునామాకు పంపండి :

**SATYA VANI**
P.o. Box. 80, Kakinada - 533 001.

సరిగా విభజించాలి (2 తిమో 2:15). ఆదిమ సంఘము అపొస్తలుల బోధయందు నిలుకడగా యుండిరి. పరిశుద్ధాత్ముడు ఆ బోధను క్రొత్తనిబంధనలో మనకు భద్రము చేసియున్నాడు. గావున మనము దేవుని వాక్యము చదువుటయందును, వినుట యందును, బోధించుట యందును ఆసక్తి కలిగియుండాలి. ఏలయనగా వినుటవలన లేక చదువుట వలన విశ్వాసము కలుగును. ఆరాధనలో వాక్యపరిచర్య (అపొస్తలుల బోధ) ఒక భాగమై యున్నది. ప్రభువు చిత్తమును పూర్ణముగా తెలిసికొను నిమిత్తమును, మనము మోసపోకుండు నిమిత్తమును, ఇతరులకు బోధించ గల్గునట్లును అపొస్తలుల బోధయందు మనము కొనసాగాలి, నిలకడగా యుండాలి. క్రీస్తు సంఘము క్రీస్తు బోధయందు నిలకడగా యుండును. కాని వారు మతశాఖల పద్ధతులననుసరింతురని సోదరులు హెచ్చరించిరి.

మార్చి 16వ తేదీ శనివారం కృష్ణాజిల్లా ముదినేపల్లిలో నిర్మించబడిన నూతన ఆలయమును సోదరులు హర్షల్‌బియర్డెన్ గారు దేవుని సేవార్థమై దేవునికి అంకితం చేసిరి. హర్షల్ గారితో సోదరులు యన్.కె.వై. దాసు (ఇబ్రహీం పట్నం) మరియు పి. షడ్రక్ (గన్నవరం) గార్లు కూడా ఆ కార్యక్రమములో పాలుపొందిరి. ఆనాడు ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ముదినేపల్లి లోను, రావిగుంటలోను సోదరులు వై. లాజరు గారు సువార్త చాటుచున్నారు.

మార్చి 20వ తేదీ బుధవారం కాట్రేనికోన మండలం గెద్దవాపల్లిలో నిర్మించబడిన నూతన ఆలయమును సోదరులు జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి ప్రతిష్ఠచేసిరి. ఆ సందర్భముగా ఆయన చక్కటి వాక్యోపదేశము గావించిరి. సోదరులు వి. రాజకుమార్ గారు రక్షణార్థమైన హెచ్చరికలిచ్చిరి. సోదరులు యన్. ఏలియా గారు ప్రార్థించిరి. కూటము అనంతరం ఇద్దరు క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిరి. గెద్దనపల్లి, పల్లం కుర్రు, కొప్పింగుంట తదితర గ్రామములలో సోదరులు బూల యోహాను గారు కష్టించి సువార్త చాటుచున్నారు.

మార్చి 20వ తేదీ ఆదివారం ఉదయం కాకినాడ ఇంద్రపాలెంలో యున్న క్రీస్తు సంఘరాధనలో సోదరులు జాషువా గూటం గారు పాల్గొని వాక్యపరిచర్యచేసిరి. తదుపరి ద్రాక్షారామ నుండి వచ్చిన సోదరులు టి. ప్రసన్న కుమార్ గారు కూడ వాక్యపరిచర్యచేసిరి. ఆరాధన అనంతరం నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిరి. ఇంద్రపాలెంలో సోదరులు జాన్ మోషే గారు సువార్త చాటుచున్నారు.

మార్చి 20వ తేదీ సాయంత్రం 3 గం॥లకు కిర్లంపూడి దగ్గరనున్న ప్రత్తిపాడులో జరిగిన సువార్తకూటములో సోదరులు జాషువాగూటం గారు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ బేసిక్ బైబిలు కోర్సు పూర్తిచేసిన 15 మందికి బైబిళ్లు, సర్టిఫికెట్లు బహుకరించిరి.

వారిలో 7గురు ఆనాడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ప్రత్తిపాడులో జి. హానోకు గారు సువార్త చాటుచున్నారు.

మార్చి 26,27 తేదీలలో రాజమండ్రి మంగళవారపు పేటలోను, ఇందిరా స్వర్ణనగర్‌లోను సోదరులు బి. లాజరస్ గారి ఆధ్వర్యమున సువార్త కూటములు ఏర్పాటు చేయబడెను. సోదరులు జాషువాగూటం, టి.వి.యన్. కుమార్ గార్లు వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సంఘము విధవరాండ్రకు అనాధులకు చీరలు పంచిపెట్టిరి. ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

మార్చి 28వ తేదీ గురువారం రాత్రి గండేపల్లి మండలం పాతనాయకంపల్లిలో ఏర్పాటు చేయబడిన సువార్తకూటములో సోదరులు జాషువాగూటం గారు వాక్యపరిచర్య చేసిరి. పలువురు హాజరై సత్యవాక్యమును శ్రద్ధతో వినిరి. వారిలో ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. పాతనాయకంపల్లి, సూరంపల్లి వగయిరా గ్రామములలో సోదరులు టి. ఆనందరావ్ గారు సువార్త చాటుచున్నారు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2002

From:

**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

To

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : JOSHUA GOOTAM.